# వారసత్వం

-కె.ఎన్.ఎస్.రాజు

విశ్వనాథం ఓ రెవిన్యూ మండల కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్. వయసు పైబడుతున్నా ఉద్యోగంలో ఎలాంటి ఎదుగు బొదుగు లేని జీవితం! ఇద్దరు కొడుకులు, ఒక కూతురు.

పై ఆదాయం ఉన్న సీటు అయినా, అక్రమ సంపాదన గిట్టని మనిషి! చేసిన పనికి ఎంతో కొంత డబ్బు ముట్టచెబుతామన్నా అంగీకరించని మనస్తత్వం! వస్తోన్న జీతం చాలు, అక్రమ సంపాదన మనిషిని అశాంతిపాలు చేస్తుందని దృఢంగా నమ్మే రకం! అతని నిజాయితీ చూసి తోటి కొలీగ్స్ మనసులో 'వీడో వెర్రిబాగులోడు' అని నవ్వుకునేవారు. ఆ సీటు నుంచి తప్పించే ప్రయత్నాలు కూడా చేశారు. అయితే అది అంత సులువు కాలేకపోయినందుకు, పై సంపాదనకు అలవాటుపడ్డవారు లోలోపలే ఉడుక్కున్నారు. అతని వద్దకు వచ్చే బయటి వ్యక్తుల్లో కొందరు అతని నిజాయితీని మెచ్చుకొంటే, మరికొందరు తిట్టుకున్నారు. తమ పనులను అడ్డదారుల్లో చేయించుకోవాలని చూసేవారు.

భర్తకు వచ్చే సంపాదనతోనే సంతృప్తిపడుతూ సంసారాన్ని నెట్టుకవస్తోంది నారాయణమ్మ. ఒకరోజు భర్త ఆఫీసుకు వెళ్ళే సమయానికి టిఫిన్ రెడీ చేసి పెడుతూ అంది-

"ఏమండీ!"

"ఆ.. ఏంటో త్వరగా చెప్పు. వెళ్ళాలి. ఆఫీసుకు టైం అయ్యింది"

"పోయిన్నెల జీతం మొత్తం బంధువులొచ్చి, ఈనెల ఇరవయ్యో తేదీకే అయిపోయిందండి. ఇంట్లో సరుకులు బొత్తిగా లేవు" అంది నారాయణమ్మ.

"అయితే ఇప్పుడు ఎలాగా?"

"మన ఇంటి పక్కన ఉండే అంగట్లో అరువు పెట్టి తేనా?"

"వద్దొద్దు! ఆ రేషన్ షాపు డీలరు ఇవ్వడు. బియ్యం బీదవాళ్లకు సప్లయి చేయకుండా బ్లాక్‌లో అక్రమంగా అమ్ముకుంటున్నందుకు బుద్ధివచ్చేట్లు చేశా."

"మరీ అంతగా పట్టించుకుంటే ఎలాగండీ. కొన్ని విషయాల్లో మనం చూసీ చూడనట్టుగా పోవాలి."

"అంటే నీ ఉద్దేశం?" కోపంగా అన్నాడు విశ్వనాథం.

నారాయణమ్మ తడబడుతూ చెప్పింది. "పక్కనే ఉంది గదా షాపు. మీకు శ్రమ లేకుండా అవసరమైనప్పుడల్లా నేనే సరుకులు అరువుగా తెచ్చుకోవచ్చునీ.. వీలునుబట్టి మనం డబ్బులు ఇచ్చినా ఏమీ అనుకునే వాడు కాదు. మనక్కూడా డబ్బు విషయంలో కాస్త వెసులుబాటుగా ఉంటుంది."

"అంటే వాడితో లాలూచీ పడమనేగా నీ ఉద్దేశం?"

ఆ మాటకు మౌనం వహించింది నారాయణమ్మ.

అరువు పెట్టడం విశ్వనాథంకు ఇష్టం ఉండదు. అరువుకు తగ్గట్లే రేట్లు కూడా ఉంటాయని! జీతం వచ్చినప్పుడే నెలకు సరిపడ సరుకులు బజారుకు వెళ్లి తేవడం అలవాటు! జీతం డబ్బులు రావాలంటే ఇంకో పది రోజులు ఆగాలి. అప్పు చేయడం తన అభిమతానికి విరుద్ధం. సరే, చూద్దాం.. అనుకుంటూ టిఫిన్ తినడం పూర్తిచేసి చేతులు కడుక్కుంటూ ఉండగా అంది నారాయణమ్మ మళ్లీ.

"వచ్చే నెల దసరా పండుగ కూడా వస్తోంది. పిల్లలకు బట్టలు కూడా కొనాల్సి వుంటుందండీ."

"పండుగ అద్వాన్సు వస్తుందిలే. బట్టలు అప్పుడు తెచ్చుకోవచ్చు. ఈ పది రోజులకు సరిపడే సరుకులు ఎలాగోలా తేవడానికి ప్రయత్నిస్తాను" అనేసి బయటకు నడిచాడు విశ్వనాథం.

ఆఫీసుకొచ్చి పనిచేస్తున్నాడన్న మాటేగాని మనసు భార్య చెప్పిన విషయంపైనే ఉంది. తోటి ఉద్యోగుల్ని అప్పు అడగటానికి మనసొప్పలేదు. అడిగినా 'బంగారు బాతులాంటి సీట్లో ఉంటూ మమ్మల్ని అడగటానికి సిగ్గులేదు' అంటూ వ్యంగ్యంగా మాట్లాడతారు. అలా ఆలోచనలతో అన్యమనస్కంగా పనిచేస్తూ సాయంకాలం ఆఫీసు అవగానే నేరుగా వెళ్లాడు ప్రతినెలా తాను సరుకులు కొనే షాపుకు. ప్రతినెల మొదటి తారీఖున వచ్చే విశ్వనాథం నెలాఖరులో రావడంతో ఆశ్చర్యాన్ని వ్యక్తపరుస్తూ, "ఏంటి సార్ ఇలా వచ్చారు?" అని అడిగాడు షాపు యజమాని.

"సరుకులు కావాలి" మెల్లిగా పలికాడు విశ్వనాథం.

"... అయితే డబ్బులు ఫస్టుకే ఇస్తాను". ఈ మాట చెప్పడానికి ఎంతో గాబరాపడ్డాడు విశ్వనాథం.

"దానికి అంత గాబరా ఎందుకు సార్? మీరు మా రెగ్యులర్ కస్టమర్ కదా! తీసుకెళ్ళండి" అంటూ

విశ్వనాథం అడిగిన సరుకుల్ని కట్టిపెట్టాడు షాపు యజమాని. తేలిగ్గా నిట్టూర్చాడు విశ్వనాథం, సరుకుల భారం తీరినందుకు.

❍ ❍ ❍

విశ్వనాథం వెలగబెడుతోన్న నిర్వాకం తెలిసిన మామ రాఘవరావు కూతుర్ని చూడటానికని వచ్చి ఆ మాట, ఈ మాట మాట్లాడుతూ, తన అల్లుడితో ఇలా చెప్పుకొచ్చాడు.

చూడు విశ్వనాథం, మనిషి నిజాయితీగా ఉండటం మంచిదే. అలాగే అప్పు చేయకుండా ఉండటం కూడా మరీ మంచిదే! కాని జీతం రాళ్ళతోనే జీవితాలు సాఫీగా సాగే రోజులు కావివి. ఇప్పుడు నీ పిల్లలు కాలేజీ చదువులు చదువుతున్నారు. తండ్రిగా వారి భవిష్యత్తు తీర్చిదిద్దాల్సిన బాధ్యత నీపైన ఉంది. వారి చదువులకు ఎంత ఖర్చవుతుందో నాకు తెలుసు. అమ్మాయికి కూడా పెళ్ళీడు వచ్చింది. బాగా ఆలోచించు."

తన మామగారి మాటల్లోని ఆంతర్యమేమిటో బోధపడింది విశ్వనాథంకు.

"అంటే లంచాలు తీసుకోమంటారు" మామగారి వంక చూస్తూ అన్నాడు విశ్వనాథం.

"లోకమే అవినీతిమయంగా మారినప్పుడు మనమొకరమే మడిగట్టుకుని కూర్చోవడంలో అర్థంలేదు. ఇబ్బందుల్లో పడటం తప్ప. మనమొకరం నిజాయితీగా ఉండి సమాజాన్ని ఉద్ధరించలేంగా. సమాజమంతా కలుషితమైన ఈ రోజుల్లో అటెండరు మొదలు ఆఫీసరు వరకు అందినంతగా దోచుకొంటున్న ఈ రోజుల్లో నువ్వొక్కడివే 'ముట్టను' అని భీష్మించుకుంటే అందరూ నిన్ను చిన్నచూపు చూస్తారేగాని గౌరవించరు. పరిస్థితుల కనుగుణంగా మనిషీ మారాలి. ఆలోచించు. అన్నీ తెలిసిన వాడికి ఇంతకన్నా చెప్పలేను."

అల్లుడికి తాను చెప్పదలచుకున్నది చెప్పాడు రాఘవరావు. తన మామ చెప్పింది విన్న విశ్వనాథం చిన్నగా నవ్వి చెప్పాడు.

"నేను కట్నం తీసుకోరాదనే నిశ్చయానికొచ్చే, మీ కూతుర్ని కట్నం లేకుండా చేసుకున్నాను. ఆ రోజు నేను మిమ్మల్ని కాణీ కట్నం అడగలేదు. కట్నం కూడా ఒక విధమైన లంచమే కదా. మరి అలాంటి ఆలోచన ఉన్న నేను, ఇప్పుడు మారమంటే మారతాననుకున్నారా? ఎవరికి వారు మన ఒక్కరం లంచం తీసుకోవటం వల్ల సమాజానికి వచ్చే నష్టం ఏమీ లేదులే అనుకోబట్టే, చివరకు అందరూ లంచగొండులై సమాజమే అవినీతిమయమయింది. ఈ అవినీతిని ఎక్కడికక్కడ అరికట్టాలే కాని ప్రోత్సహించరాదు. దయచేసి ఇలాంటి సలహాలు ఇవ్వకండి."

మారు మాట్లాడక ఉండిపోయాడు రాఘవరావు.

❍ ❍ ❍

పదేళ్ళు గడిచాయి.

విశ్వనాథం చేస్తోన్న ఉద్యోగం నుంచి రిటైరయ్యాడు. ఇద్దరు అబ్బాయిలు, అమ్మాయి డిగ్రీ పూర్తిచేశారు. పెద్దవాడు శంకరం శారీరకంగా దృఢంగా ఉండటంతో ఎస్ఐగా సెలక్టయ్యాడు. అయితే రెండు లక్షల లంచం పై అధికారులు అడిగేసరికి కంగుతిన్నాడు. తండ్రి వద్దకు పరుగుతీసి, విషయం చెప్పి, రిటైర్మెంట్ డబ్బులు ఇవ్వమని అడిగాడు. అతనే కాదు, భార్య, చుట్టుపక్కల వాళ్ళు ఎవరు ఎన్నివిధాలుగా చెప్పినా విశ్వనాథం అంగీకరించలేదు.

'లంచం నా దృష్టిలో నేరం' అని అందరితో చెప్పాడు. అందరూ విశ్వనాథాన్ని ఓ వెర్రివాడిగా చూశారు.

'ఇది నా భవిష్యత్తు సమస్య. ఇవ్వు నాన్నా' కన్నీరు నింపుకుంటూ ప్రాధేయపడ్డాడు శంకర్.

"లంచం ఇచ్చి చేసే ఉద్యోగం నీవు చేయక్కర్లేదు. రెండు లక్షలు ఇచ్చి ఉద్యోగంలో చేరిన నీవు ఊరుకోవు. ఆ రెండు లక్షలు ఎలా రాబట్టాలని ఆలోచిస్తావు. న్యాయానికి సమాధి కట్టి, .నేరస్తులకు సహకరిస్తావు. ఆ రెండు లక్షలు సంపాదించాక కూడా ఇంకా సంపాదించాలనే ఆశ తతపుడుతుంది. చివరికి, నువ్వే నేరాలను ప్రోత్సహించి, నేరస్థులకు అండదండలు అందిస్తావు, ప్రస్తుతం జరుగుతున్నదదే. నా కొడుకు ఓ అవినీతిపరుడిగా, సమాజానికి పట్టబోయే చీడపురుగుగా మారటం నాకిష్టంలేదు" కుండ బద్దలు కొట్టినట్టుగా చెప్పాడు విశ్వనాథం.

"నిజాయితీగా ఉద్యోగం చేస్తాను. డబ్బివ్వు నాన్నా" ఆవేదనగా అడిగాడు శంకర్.

"నువ్వు రెండు లక్షలు ఇవ్వాలనుకున్నప్పుడే నీలో స్వార్థం తలెత్తిందని అర్థమైంది. సెలెక్టు అయిన నీవు రెండు లక్షలు ఎందుకు ఇవ్వాలని ధైర్యంగా ప్రశ్నించలేకపోయావు. ఇప్పుడే వారిని ధైర్యంగా ఎదిరించలేనివాడివి, ముందు ముందు నీ డ్యూటీ సక్రమంగా నెరవేరుస్తావన్న నమ్మకం ఏమిటి?

నేనివ్వను. కావాలంటే ఏదైనా వ్యాపారం పెట్టుకో. డబ్బిస్తాను" స్థిరంగా చెప్పాడు విశ్వనాథం.

ఛీతులారా కన్న కొడుకు భవిష్యత్తు నాశనం చేయడానికి పూనుకున్న తండ్రిని నిన్నే చూస్తున్నాను. నీ కొడుకుగా పుట్టడమే నేను చేసుకున్న పాపం" తండ్రిని తిట్టుకుంటూ, ఏడుస్తూ బయటికి వెళ్లిపోయాడు శంకరం.

విషయం తెలిపిన వాళ్లందరూ విశ్వనాథాన్ని ఓ ముద్దాయిని చూసినట్లు చూసి లోలోపల తిట్టుకున్నారు. అందులో భార్య కూడా చేరడం మనసుకు కొద్దిగా బాధగా అనిపించింది విశ్వనాథానికి.

రెండో కొడుకు శేఖర్ కూడా అన్నయ్య పక్షం చేరాడు. తనకేమీ పట్టనట్టు కూర్చున్నాడు విశ్వనాథం. వాటాల కోసం గొడవలు మొదలయ్యాయి.

❍ ❍ ❍

తాను సంపాదించి కట్టించిన ఇల్లు కాదు కాబట్టి, ఇల్లును కొడుకులకే అప్పగించి, భార్య, కూతుర్ని వెంట రమ్మని కోరాడు విశ్వనాథం. కొడుకు విషయంలో భర్త ప్రవర్తనకి మనస్సు చివుక్కుమన్న నారాయణమ్మ రానంది. కూతురు వసుధను అడిగాడు.

"నే వస్తా నాన్నా" అంటూ బట్టలు సర్దుకుంది.

"రిటైర్మెంట్ డబ్బు విషయం తేల్చండి" అడిగారు కొడుకులిద్దరూ.

"అది నా స్వార్జితం. అందులోంచి ఒక్క పైసా కూడా ఇవ్వను".

"ఎందుకివ్వవూ?" ముక్తకంఠంతో ఆవేశంగా పలికారు కొడుకులు.

"ఇవ్వాలని చట్టం లేదు" సమాధానమిచ్చాడు విశ్వనాథం.

"రిటైరయిన ఉద్యోగులంతా తమ రిటైర్మెంటు డబ్బును కొడుకుల కివ్వక మూట కట్టుకుపోవటం లేదు" కఠినంగా పలికారు ఇద్దరూ.

"ఒకరి విషయం నాకనవసరం. ఇల్లు ఇచ్చాను. ఏమైనా చేసుకోండి. నా పరిధి మేర చదివించాను. సొంతంగా ఉద్యోగం సంపాదించుకొని బ్రతకండి."

"వ్యాపారం చేసుకోవడానికి డబ్బిస్తానన్నారుగా?" అడిగాడు శంకర్.

"అది మీరు వాటాలు అడక్క ముందుమాట. ఇంటిలో వాటాలు అడిగి, నన్ను బయటకు తరుముతున్నప్పుడు నా డబ్బుతో పనేమిటి? చస్తే ఇవ్వను."

"ఎలా ఇవ్వరో చూస్తాం?" తీక్షణంగా చూశారు కొడుకులు.

"మీ ఇష్టమొచ్చిన పని చేసుకోండి" అనేసి కూతురు వసుధను వెంటబెట్టుకొని ఆ ఇంట్లో నుంచి బయటికి నడుస్తూ భార్య నారాయణమ్మ వంక చూశాడు. ఆమె కోపంగా ముఖం తిప్పుకుంది. పాతికేళ్ళు తనతో సంసారం చేసిన భార్య తననే అర్థం చేసుకోలేకపోయింది.

"వస్తాను" అంటూ భార్య వంక చూసి గుమ్మం దాటాడు కూతురితో.

❍ ❍ ❍

అద్దె ఇంట్లో వాలు కుర్చీలో కూర్చుని దీక్షతో ఆలోచిస్తున్న తండ్రి వంక చూస్తూ అడిగింది వసుధ.

"ఏంటి నాన్నా ఆలోచిస్తున్నారు."

"నీ పెళ్ళి గురించే అమ్మా!"

"దానికి దిగులెందుకు నాన్నా. మీరు చెప్పించిన చదువుతో నాకు టీచర్ ఉద్యోగం వచ్చింది. బ్రతుకుతెరువు చూపించారు. ఇక పెళ్ళి విషయమంటారా? నేను మీ రక్తం పంచుకుని పుట్టినదాన్ని. మీలాగే నీతిగా జీవించాలన్నదే నా అభిమతం. మీరు కట్నం ఆశించకుండా అమ్మను పెళ్లిచేసుకున్నారు. నేను మీలాగే కట్నం ఆశించని వ్యక్తినే వివాహమాడతాను. ఒకవేళ అలాంటి వ్యక్తి దొరకలేదనుకో అవివాహితగా ఉండిపోతాను."

"అమ్మా..."

"భయపడకండి నాన్నా. ఏది ఎట్లా జరగాలో కాలమే నిర్ణయిస్తుంది."

తన ఆశయాలు పునరుజ్జీవింపజేయడానికి కూతురు వారసురాలైనందుకు విశ్వనాథం కళ్ళు చెమర్చాయి.

■

## వసంత శోభ

ప్రకృతి శోభ ఎంత రమ్యం?
ఆకృతేమో కడు మర్మం!
సుషుమ కాల కుసుమ కాంతి
విషయ శరుని అసమధాటి
వసంత కాల వింత వాసి
పసందుచేయు "మిథున రాశి"!

-ఓరుగంటి మురళీధర్